వీఆర్ఓలకు న్యాయం చేయాలి

కీసర: పూర్వ వీఆర్ఓలను జీపీఓలుగా నియమించేలా ప్రభుత్వం ఇచ్చిన జీవో లోపభూయిష్టంగా ఉందని, కొన్ని సవరణలు చేసి అనుభవజ్ఞులైన మాజీ వీఆర్ఓలను నియమించి, ఉద్యోగ హక్కులను కాపాడి న్యాయం చేయాలని తెలంగాణ రెవెన్యూ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు కోరారు. శనివారం కీసరలోని ఆర్డీవో కార్యాలయంలో జిల్లా జేఏసీ చైర్మన్ శ్రీహరినాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. జీవో 129లో పలు అంశాలను సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర మహిళా నాయకురాలు ప్రతిభ, జిల్లా నాయకులు రమేష్, మల్లేష్, రాజు, అశోక్, విజయ్, హరీష్, మమత, సుష్మిత తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు అండగా 'పీఆర్‌టీయూటీఎస్'

కీసర: ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూటీఎస్ సంఘం పనిచేస్తుందని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సాయిధరణి ఫేస్-2లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు అనురాధ ఇటీవల మరణించడంతో శనివారం ఆయన పీఆర్‌టీయూటీఎస్ సంఘం నేతలతో కలిసి ఆమె కుటుంబసభ్యులను కలిశారు. సంఘం తరఫున రూ. లక్ష ఆర్థికసాయం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, పీఆర్‌టీయూ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిలింగ్ స్థావరంపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

మేడ్చల్‌రూరల్: అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న స్థావరంపై మేడ్చల్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి, పూడూరులోని ఓ షెటర్‌లో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి సిలిండర్లు, కొలత మిషన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

నిరంతర సాధనతో క్రీడల్లో రాణించాలి



అకాడమీని ప్రారంభిస్తున్న వజ్రేష్‌యాదవ్

పోచారం: నిరంతర సాధన చేస్తూ వర్ధమాన క్రీడాకారులుగా పిల్లలు రాణించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం పోచారం మున్సిపాలిటీలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఎంఎస్‌డీ క్రికెట్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలపై పిల్లలు ఆసక్తిని కోల్పోకుండా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడా సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అకాడమీలు ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బీ- బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, సీనియర్ నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని, అకాడమీ ప్రతినిధులు మల్లేష్, సంతోష్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కీసర వైద్యాధికారిగా డాక్టర్ మనుజరెడ్డి



కీసర: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ మనుజరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన సౌందర్యలత గాంధీ వైద్య కళాశాలలో పీజీ చేసేందుకు వెళ్లారు. కొన్నాళ్లు కుషాయిగూడ వైద్యాధికారిని సుప్రియ డిప్యూటేషన్‌పై పనిచేశారు. సంగారెడ్డిలో పనిచేసిన మనుజరెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

భార్యపై హత్యాయత్నం కేసులో..

నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

కీసర: భార్యపై హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మల్కాజిగిరి జిల్లా పీఎస్‌జే కోర్టు తీర్పు వెలువరించింది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్‌లో నివాసం ఉంటున్న రామహరిప్రసాద్(47) నాంపల్లిలోని సీసీఎల్ఏలో తహసీల్దార్‌గా పని చేస్తున్నాడు. కాగా ప్రేమ పెళ్లి చేసుకున్న అతడు భార్యను తరచుగా వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ క్రమంలో 2020లో అతడు భార్యపై హత్యాయత్నం చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసులో మల్కాజ్‌గిరి జిల్లా పీఎస్‌జే కోర్టు న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించి, ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు.

జై హనుమాన్

మేడ్చల్ జోన్ పరిధిలో హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం వీర హనుమాన్ శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. పలుచోట్ల భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బైక్ ర్యాలీలు, 'జై శ్రీరామ్' నినాదాలతో యువత ర్యాలీ చేపట్టగా.. నృత్యాలు అలరించాయి.
– మేడ్చల్ జోన్ బృందం



ఘట్‌కేసర్‌లో మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య



అంబేద్కర్ చౌరస్తాలో..





నాగారంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



మేడ్చల్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర

పట్టని ప్రగతి !

- పురపాలిక వార్డులకు కమిటీల ఏర్పాటు
- ప్రతీ వార్డుకు 4 కమిటీలు, మొత్తం 15 మంది సభ్యులు
- పేరుకుపోయిన సమస్యలు, పేరుకే కమిటీలు

పురపాలిక వార్డుల అభివృద్ధిలో కాలనీవాసుల భాగస్వామ్యం ఉండేలా గత ప్రభుత్వం వార్డు కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన పనుల్లో వీటి భాగస్వామ్యం ఏమాత్రం కనిపించడం లేదు.
– సాక్షి, సిటీబ్యూరో



మేడ్చల్, మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలోని 29 పురపాలక సంఘాల్లో 676 వార్డులు ఉండగా, ఇందులో ఉన్న 2,704 కమిటీల్లో 40,560 మంది సభ్యులను ఎంపిక చేశారు. వివిధ పట్టణాల్లో రాజకీయ కారణాలతో కమిటీలు నామమాత్రమయ్యాయి. ఏర్పాటు చేసిన రోజు మినహా సభ్యులను ఇంత వరకు పుర కార్యాలయాలకు పిలిచింది లేదనే విమర్శలున్నాయి. దీంతో వార్డుల్లో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు.

ప్రత్యేక దృష్టి అవసరం..

పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పట్టణ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యాన్ని గుర్తించిన గత ప్రభుత్వం 2021లో కమిటీలను ఏర్పాటు చేసింది. పట్టణాల్లో వార్డుకు 4 కమిటీలు, ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులను ఎంపిక చేశారు. యువజన సంఘం, సీనియర్ సిటిజన్, మహిళా సంఘం, వార్డు ప్రముఖులతో కలిపి కమిటీని రూపొందించారు.

◆ ప్రజలతో సంబంధం కలిగిన ఉన్న వారు, విద్యావంతులను కమిటీలో చోటు కల్పించారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో వారి పాత్ర కీలకమనే విషయాన్ని పుర అధికారులు విస్మరించారు

◆ పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ, హరితహారం (వనమహోత్సవం), పారిశుద్ధ్యం, నీటిసరఫరా, అక్రమ కట్టడాలను నివారించడం, అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉండటంతో వీరంతా వార్డుకు కావాల్సిన అవసరాలపై పూర్తి స్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో కమిటీల పనితీరు మెరుగుపడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టణాల్లో సమస్యలివే..

పారిశుద్ధ్య పనులు 100శాతం జరగడం లేదు.

◆ మురుగు కాలువలు, సీసీ రహదారుల నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలాల ఆక్రమణలతో చిన్నపాటి వర్షాలకు లోతట్టు ప్రాంతంలో ఉన్న కాలనీలు, వీధుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. హరితహారం కింద నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతోంది. చాలా పట్టణాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ప్రాణాంతక ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం కొరవడి ఎటు చూసినా ఆ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి అంతంతే...

◆ శివారు పట్టణాల్లో ముక్కుపిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా... పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా పురపాలక సంఘాలకు నిధులు విడుదల అవుతున్నాయి. ఈ నిధులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ, పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం



మునీరాబాద్‌లో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పోచారం: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం అన్నారు. శనివారం అన్నోజిగూడలోని ఎల్ఎస్‌కాలనీలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు రాజ్యాంగాన్ని మార్చాలనే సంకల్పంతో ఉన్నారని, అలాంటి వారి ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బీ- బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, పోచారం మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్, నాయకులు గణేష్‌యాదవ్, దేవేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ నేతలు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని గౌడవెల్లి, మునీరాబాద్ గ్రామాల్లో పాదయాత్ర చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడు రవిముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు తదితరులున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



బీజేపీ జాతీయ మాజీ కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం



ఎల్లంపేట్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

కీసర: అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో బస్తీ చలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 46 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో కార్యకర్తల త్యాగం, సేవాభావంతో బీజేపీ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. బీజేపీ జాతీయ మాజీ కౌన్సిల్ సభ్యులు, ఎం. సత్యనారాయణను ఆయన నివాసంలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.అనంతరం కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవకు గుర్తుగా ఆర్ఎల్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద వారిని సన్మానించారు. బీజేపీ నేతలు సురేష్, బొమ్మిడి బుచ్చిరెడ్డి, గణపురం శ్యామ్‌సుందర్, బలరాం, మాజీ కౌన్సిలర్లు బిజ్జశ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి వేణుగోపాల్, జంగారెడ్డి, కొకుట్ల రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ గావ్ చలో'.. బస్తీ చలో'..

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలోని సైదోనిగడ్డ తండా, ఎల్లంపేట్ గ్రామాల్లో బీజేపీ నేతలు 'గావ్ చలో', బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వచ్ఛ భారత్ చేపట్టి దేవాలయాలు, మహనీయుల విగ్రహాలు, రోడ్లు, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో పరిసరాలు శుభ్రం చేశారు. జిల్లా నాయకులు జగన్‌గౌడ్, బూత్ ఇన్‌చార్జ్‌లు పుష్పమల్లారెడ్డి, గోపినాయక్, నాయకులు మహేష్, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమాన్ని అటకెక్కించిన ప్రభుత్వం

ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

పోచారం: ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి అతీగతీ లేదని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో జరుగుతున్న భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టర్స్ మజ్దూర్ యూనియన్ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. ఆటో మొదలుకుని భారీ ట్రక్కులు నడుపుతున్న డ్రైవర్లకు అనేక సమస్యలు ఉన్నాయని, వారికి సామాజిక భద్రత, ఆరోగ్యం, జీవితబీమా విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. ఆటో డ్రైవర్ల బాధలు పోవాలంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. మజ్దూర్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు హిరణ్య పాండ్యా, మహాసభ జాతీయ అధ్యక్షుడు ఆశిష్‌దత్తా, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, వీఆర్ వాత్సాయన్, మల్లేశం, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ లెర్నింగ్ సెంటర్ సందర్శన

మేడ్చల్: మేడ్చల్‌లోని రైల్వేస్టేషన్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్టిఫీషియల్ లెర్నింగ్ సెంటర్‌ను విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి శనివారం సందర్శించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం 'లెర్నింగ్ త్రూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్' పైలెట్ ప్రాజెక్టును విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు నూతన సాంకేతిక పద్ధతులు, బోధన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఐ ల్యాబ్ పనితీరును ఆయన పరిశీలించారు.



అదృశ్యమైన యువకుడి మృతి



చందు (ఫైల్)

పోచారం: ఇటీవల అదృశ్యమైన యువకుడు మృతి చెందిన ఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీకి చెందిన లొట్టి చందు (23) ఈనెల 9న రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. స్నేహితుడికి ఫోన్‌చేసి యంనంపేట్‌లో రైల్వేట్రాక్‌పై ఉన్నానని, జీవితంపై నిరాశ ఉందని చెప్పాడన్నాడు. ఇదే విషయాన్ని చందు తల్లిదండ్రులకు అతడు సమాచారం ఇవ్వగా.. వారు రైల్వేట్రాక్‌పై కుమారుడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. 10న ఉదయం 2గంటల సమయంలో ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తున్న చందును ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో రైల్వే అధికారులు 108 వాహనంలో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ప్రమాదం జరిగిన చోట లభించిన సిమ్‌కార్డు ఆధారంగా రైల్వే పోలీసులు చందు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని శనివారం స్వాధీనం చేశారు.

ఎవరికి వారు బిజీ, బిజీ !

- పార్టీ కార్యక్రమాలతో ప్రజల్లో కేంద్ర, రాష్ట్ర అధికార పార్టీలు
- నామమాత్ర కార్యక్రమాలకు బీఆర్ఎస్ పరిమితం
- విహారయాత్రల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



జపాన్ దేశంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: నియోజకవర్గంలో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు బిజీగా మారిపోయారు. పార్టీల హైకమాండ్‌లు పిలుపునిచ్చిన కార్యక్రమాలతో రెండు పార్టీల నాయకులు నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ గడుపుతున్నారు.

◆ వరుసగా గ్రామస్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో మండల, మున్సిపల్, జిల్లా స్థాయి వరకు ఉన్న నాయకులంతా ఒక్కసారిగా రాజకీయంగా బిజీగా మారిపోయారు.

పాదయాత్రలు చేస్తున్న కాంగ్రెస్..

◆ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలతో కాంగ్రెస్ నాయకులు ఊరురా తిరుగుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఇంచార్జ్ వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితర నాయకులు పాదయాత్రలు చేస్తున్నారు.

బస్తీ బాట, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బీజేపీ..

◆ పార్టీ ఆవిర్భావం, మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంత్యుత్సవాలు తదితర కార్యక్రమాల పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల దగ్గరకు వెళ్తోంది. నాయకులు పట్టణాల్లో బస్తీ బాట పేరుతో యాత్రలు చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో బీజేపీ నేతలు వీధులు, చెరువులు, స్కూళ్లు, ఆలయాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేస్తూ.. నిత్యం ప్రజల మధ్యలో ఉండే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డిలు యాత్రల్లో భాగమై కిందస్థాయి పార్టీ కేడర్‌ను కదిలిస్తున్నారు. పార్టీ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గం అంతా పార్టీ కార్యక్రమాల పేరుతో సుడిగాలి పర్యటన చేస్తున్నారు.

నామమాత్రపు కార్యక్రమాలకు బీఆర్ఎస్ పరిమితం..

◆ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నామమాత్రపు కార్యక్రమాలకు పరిమితమైంది. చాలమంది నాయకులు పార్టీని వీడటంతో ఉన్న నాయకులతో కలిసి కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ రజతోత్సవం నిర్వహిస్తుండటంతో నాయకులు సభను విజయవంతం చేసేందుకు జన సమీకరణలో పూర్తిగా నిమగ్నమయ్యారు.



బస్తీ బాటలో బీజేపీ నాయకులు

విహారయాత్రల్లో ఎమ్మెల్యే..

◆ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. వారం రోజుల పాటు జపాన్ దేశంలో ఆయన గడపనున్నారు.

పర్యవేక్షణ లోపం.. చెట్లకు శాపం



నరికిన చెట్ల తుంగలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి మొక్కలు నాటించి వాటిని సంరక్షిస్తే కొందరు ఇష్టానుసారంగా చెట్లను నరికివేశారు. మూడుచింతలపల్లి మండలం కేంద్రం నుంచి తుర్కపల్లి వరకు హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గత ప్రభుత్వ హయాంలో మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. ఈ క్రమంలో పోతారం చౌరస్తా వద్ద ఇటీవల ఓ రెస్టారెంట్ ప్రారంభమైంది. కాగా ఈ చెట్లు రెస్టారెంట్‌కు అడ్డుగా వస్తున్నాయని నిర్వాహకులు ఫారెస్ట్, విద్యుత్‌శాఖ గ్రామస్థాయి ఉద్యోగులను మచ్చిక చేసుకుని ఇష్టానుసారంగా చెట్లను మొదళ్ల వరకు నరికించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెట్లను నరికివేస్తున్నారని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తే గాలికి పడిపోయాయని, చెట్లను ఎవరూ నరికివేయడం లేదని సమాధానమిచ్చాడని తెలుస్తోంది. లక్షల్లో ప్రజాధనం వెచ్చించి చెట్లను నరికివేస్తుంటే ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయభాస్కర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని మీడియాకు వివరణ ఇచ్చారు.